క్లుప్తంగా

సీఎంని కలిసిన రాయల



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు

నేలకొండపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైద్రాబాద్‌లోని తన క్యాంపు కార్యాలంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి ని భారీ మెజార్టీతో గెలవటానికి కృషి చేసినందుకు రాయల నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. ఆయన వెంట ఖమ్మం జిల్లా నాయకులు పలువురు పాల్గొన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మూడు అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటీవల ఖమ్మం రైల్వే పోలీస్ పరిధిలోని రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని రెండు మగ మృత దేహాలు, ఖమ్మం టూ టౌన్ పోలీస్ పరిధిలోని గుర్తు తెలియని మగ మృతదేహం లభ్యం కాగా ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. ఇన్ని రోజులైనా ఎవ్వరూ రాకపోవటంతో పోలీసులు అన్నం సేవా ఫౌండేషన్‌కు సమాచారం అందించడంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: అనాథ శవానికి ప్రకాశ్‌నగర్ వైకుంఠధామంలో బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం త్రీటౌన్‌లో భిక్షాటన చేసే వృద్ధుడు చనిపోగా స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ట్రస్టు చైర్మన్ బాలు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలు నిర్వహించిన వారిలో ట్రస్టు సభ్యులు పందివేణు, కె.కాశయ్య, గట్టికొండ చుక్కయ్య, సైదులు, పడిశాల వీరస్వామి, సీతారాములు, కోటయ్య పాల్గొన్నారు.

సాయిమందిరంలో ప్రత్యేక పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14 వ డివిజన్ మధురానగర్‌లోని సాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి హారతి, పూలాభిషేకంతో పూజలు చేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు, అన్నదానం చేశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
సాయిరాం	సత్యభామ
ఆదిత్య	రక్షణ
శ్రీనివాస	భజే వాయువేగం
సుందర్	లవ్‌మౌళి

\- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	54	బచ్చలికూర	4 / 20
వంకాయ	20	పాలకూర	3 / 20
బెండకాయ	36	చుక్కకూర	3 / 20
పచ్చిమిర్చి	100	తోటకూర	4 / 20
కాకర	76	గోంగూర	4 / 20
బీర	76	మెంతికూర	3 / 20
దొండ	18	కొత్తిమీర	1 / 30
పొట్లకాయ	40	పుదీన	1 / 20
గోరుచిక్కుడు	60		
క్యాబేజీ	26		
క్యాలీఫ్లవర్	24		
ఆలుగడ్డ	34		
చామగడ్డ	50		
క్యారెట్	66		
క్యాప్సికం	80		

-ఖమ్మం వ్యవసాయం

కట్ట పోయి రోడ్డు వచ్చే..

లింక్ రోడ్డుగా మారనున్న నరసింహులు చెరువుకట్ట

- రూ.కోటి 15 లక్షల నిధులతో తారురోడ్డు
- తగ్గనున్న దూరాభారం
- తొలగనున్న రైతుల, మత్స్యకారుల ఇబ్బందులు



కొనసాగుతున్న రోడ్డు పనులు

రఘునాథపాలెం: ఇప్పటివరకు పెరిగిన కంపచెట్లు, జారిన కట్టలతో చెరువుకట్టకే పరిమితం అయిన రఘునాథపాలెంలోని నరిసింహులు చెరువుకట్ట నేడు లింక్ రోడ్డుగా ప్రజలకు ఉపయోగపడబోతోంది. రఘునాథపాలెం నుంచి రఘునాథపాలెం బైపాస్ రోడ్డుకు లింక్‌గా కిలోమీటర్ 300 మీటర్లపైగా దూరంతో ఉన్న డొంక రోడ్డును రూ.1 కోటి 15 లక్షలతో తారు రోడ్డుగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గ్రామీణ లింక్‌రోడ్డుల(సీఆర్ఆర్) నిధుల నుంచి మంజూరైన రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే పాత చెరువు కట్టను వెడల్పు చేసి 20 అడుగుల మేరా రోడ్డుగా అభివృద్ధి చేశారు. 12 అడుగులు తారు రోడ్డు నిర్మాణానికి కంకరవేసి తారు వేసేందుకు సిద్ధం చేశారు. ఈ రోడ్డులో అలుగు కూడా ఉండటంతో అలుగుచప్టాపై సీసీ కాంక్రీటు వేసి అలుగు నుంచి తూము వరకు 30 మీటర్ల దూరం వరకు సీసీ రీటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారు. కంపచెట్లు, గుంతల పడిన రోడ్డుతో ఏళ్లుగా ఇబ్బంది పడిన రైతులకు పొలం పనులకు వెళ్లడానికి ప్రయాణం ప్రయాసంగా ఉండేది. చెరువుకట్టకు రావాలంటేనే రైతులు, మత్స్యకారులు నానా ఇబ్బంది పడేవారు. గతంలో డొంక రోడ్డును మట్టిరోడ్డుగా అభివృద్ధి చేయడంతో ఇక్కడ డొంక రోడ్డు ఉందనేది చాలా మందికి తెలిసే కాదు. కొన్నేళ్ల క్రితం మట్టి రోడ్డు, ప్రస్తుతం తారు రోడ్డు నిర్మాణం జరుగుతుండటంతో డొంక రోడ్డు తారు రోడ్డుగా మారుతుందని రైతులు ఆనందపడుతున్నారు.

తగ్గనున్న దూరాభారం..



నరిసింహులు చెరువుపై పక్కన ఉన్న పొలాలకు, రఘునాథపాలెం బైపాస్ రోడ్డుకు రాకపోకలు సాగించాలంటే ప్రజలు నానా తిప్పలు పడేవారు. వర్షాకాలంలో ఆ ఇబ్బంది అంతా ఇంత కాదు. ఖమ్మం- ఇల్లెందు రోడ్డుకు వచ్చి అక్కడ నుంచి బైపాస్ రోడ్డు రాకపోకలు సాగించే వారు. ఈ రోడ్డు వేయడంతో గతంలో 3 కిలో మీటర్లు ఉంటే ఇప్పుడు కిలోమీటర దూరంలోనే బైపాస్ రోడ్డుకు మార్గం సుగుమం అయిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రం నుంచి పొలాలకు రాకపోకలు సాగించే వారితోపాటు, వాహనదారులు, వీవీపాలెంలోని కలెక్టరేట్‌కు, వైరా రోడ్డుకు రాకపోకలు సాగించే వారికి ఎంతో అనువుగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

20 రోజుల్లో పనులు పూర్తి..

రోడ్డు చివరి దశలో ఉన్నాయి. పూర్తి స్థాయిలో పనులు 20 రోజుల్లో పూర్తి అయ్యి రోడ్డు అందుబాటులోకి వస్తుంది. - **ఆదిత్యరాజు, పీఆర్ ఏఈ**

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

- అధికారులు, సిబ్బందిని ఆదేశించిన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని డివిజన్‌లలో పారిశుధ్య, డ్రెయినేజీ సమస్యలను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్‌లలో పూడిక, సిల్ట్‌తో నిండి ఉన్న డ్రెయినేజీలను తక్షణమే గుర్తించాలన్నారు. వెంటనే డివిజన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ అనుమతులు అంటూ కాలయాపన చేయొద్దని, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో ఆ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అక్కడ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

ప్రజా పోరాటాలు చేపట్టాలి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మోదీ, అమిత్‌షా లాంటి విధ్వంస నాయకులకు తగు సమాధానం చెప్పే రీతిలో ప్రజా పోరాటాల నిర్మాణం చేపట్టాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సీపీఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) జయంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత పాత్ర పోషించిన సీఆర్ ఉద్యమ చీలిక సమయంలో సీపీఐకి దన్నుగా నిలిచి, జాతీయ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేశారన్నారు. దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని, ప్రజలు మరోసారి మత రాజకీయాలను తిరస్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహం



నగదు అందజేస్తున్న సీఐ, ఎస్సై తదితరులు

ఖమ్మంఅర్బన్: ఇటీవల వెల్లడైన పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ద్విచక్ర మెకానిక్‌ల పిల్లలను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు అభినందనీయులని ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు అన్నారు. జిల్లా టూ వీలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన ఐదుగురు విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. యూనియన్ తరఫున రూ.5వేలు ఇస్తుండగా తాను సైతం అన్నట్లు రూ.2వేలు ఇస్తానని ప్రకటించారు. ఆపై శివరామకృష్ణ రూ.500 ఇస్తానని ముందుకు రావడంతో విద్యార్థులు ఆవుల రేఖశ్రీ, బండి రక్షిత, అంబటి తనుశ్రీ, సాయిచరణ్‌కు రూ.7,500 చొప్పున సీఐ అందజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు, ట్రాఫిక్ ఎస్‌ఐ సాగర్‌తో పాటు శ్రీను, నాగేశ్వరరావు, మురళి, రమేష్, శివరామకృష్ణ, శేషు, అనిల్, హరి, లాలయ్య, ఉపేందర్, వెంకట్, రవి తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు దాణా వితరణ



దాణా అందజేస్తున్న సేవా సమితి ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: వైశాఖ బహుళ అమావాస్య, శ్రీ శనీశ్వరుని జయంతి సందర్భంగా నగరంలోని గొల్లగూడెం ఓం శ్రీ కృష్ణ గోశాలకు శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రూ. 51 వేల విలువైన దాణాను అందించారు. దాల్ యజమానులు, గో ప్రేమికులు, శ్రీ స్తంభాద్రి సేవా సమితి సభ్యులు దాతృత్వంతో వివిధ రకాల దాణాను గోశాలకు అందించినట్లు సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి పెనుగొండ శ్రీనివాస రావు, సభ్యులు సూరినేటి మల్లేశం, బజ్జూరి రమణా రెడ్డి, సోమారపు సుదీర్, దేవరశెట్టి రామారావు, ఇమ్మడిశెట్టి నారాయణ రావు, గజ్జి సూర్యనారాయణ, పులిపాటి సంపత్ కుమార్, వీవీ సుబ్బారావు, మోతుకూరి భద్రయ్య, వంగవీటి నవీన్, ఈదెగాని నాగేశ్వరరావు, సుంకర యల్లారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలకు, గో ప్రేమికులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బాలుడికి పాముకాటు

నేలకొండపల్లి: స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న బాలుడిని పాటు కాటేసింది. మండల కేంద్రానికి చెందిన పదేళ్ల బాలుడు కె.పూర్ణేష్ గురువారం ఇంటి వద్ద మరికొందరితో కలిసి ఆడుకుంటున్నారు. ఈ సమయాన ఆయనను పాము కాటేసింది. దీంతో తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నేలకొండపల్లి: రెండు బైక్‌లు ఢీ కొన్న నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని నాచేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచేపల్లికి చెందిన అప్పారావుతో పాటు బాణాపురం వాసి ఓ బైక్‌పై గ్రామానికి వస్తుండగా సదాశివాపురం గ్రామానికి చెందిన ఇరువురు బైక్‌పై వస్తున్న క్రమంలో నాచేపల్లిలో బొడ్రాయి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో గాయపడిన నలుగురికి ప్రథమ చికిత్సకు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

నేలకొండపల్లి: మండలంలోని మండ్రాజుపల్లి కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రం తాళాలు పగలగొట్టి బియ్యం, కందిపప్పు, కారం, చింతపండు, పసుపు, గ్యాస్ సిలిండర్, వంట పాత్రలు, ప్లేట్లు ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించిన అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ ఇచ్చిన సమాచారంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి పరిశీలించాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమతులు లేని స్కూళ్లను రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం మయూరిసెంటర్: నగరంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ స్కూళ్లను రద్దు చేయాలని కోరుతూ గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండానే ఇంటర్నేషనల్ స్కూల్ అంటూ బోర్డులు పెట్టి పలు విద్యాసంస్థలు అడ్మిషన్లు ఇస్తున్నారన్నారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి విద్యా సంస్థలను గుర్తించి, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సంపత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ

కూసుమంచి: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డి తల్లి పద్మమ్మ ఇటీవల మృతిచెందగా గురువారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పద్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కల్లూరిగూడెం సొసైటీ చైర్మన్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు, నరేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నివాళి..



రామచంద్రయ్య (ఫైల్)

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ నాయకులు, ప్రముఖ వైద్యులు శీలం పాపారావు తండ్రి రామచంద్రయ్య (80) గురువారం మృతి చెందగా వివిధ పార్టీల నాయకులు, వైద్యులు నివాళులర్పించారు.నివాళులర్పించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ మురళి, మూర్తి వీరభద్రప్రసాద్, శ్యాం రాథోడ్, నాయకులు వడ్డెబోయిన నర్సింహారావు, శ్రీనివాసరావు, వి.శంకర్‌రావు కార్పొరేటర్లు కమర్తపు మురళి, పగడాల నాగరాజు, కొప్పెర జానకి రాములు, రావుల హనుమంతరావు, కాశిబోయిన అనంతరాములు, నాగేశ్వరరావు, మామిడి వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, దోకుపర్తి సుబ్బారావు, విద్యాసాగర్, నరేందర్, భద్రూనాయక్, నజీమా, ఉపేంద్రబాయి, జంగిల్ రవి, మామిడాల ఝాన్సీ పాల్గొన్నారు.

'నీట్'లో ప్రతిభ చాటిన విద్యార్థులు

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని గిరిజన ప్రతిభ కాలేజీకి చెందిన విద్యార్థులు నీట్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని ప్రిన్సిపాల్ ఎం.బాలస్వామి తెలిపారు. ఈ మేరకు జర్పుల ఆకాష్ 415 మార్కులు జాతీయ స్థాయి కేటగిరిలో 7,994 ర్యాంక్, రత్లావత్ బాలాజీ 406 మార్కులతో 8,748 ర్యాంక్, పి.తరుణ్ 403 మార్కులతో 9,043 ర్యాంక్ సాధించారన్నారు. అదే విధంగా గణేష్ 375 మార్కులు, శ్రీకాంత్ 371, ఉమేష్ చంద్ర 319 మార్కులతో తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

మతోన్మాదాన్ని తిప్పికొట్టిన ప్రజలు

ఖమ్మంమయూరిసెంటర్: మోదీ ఎన్ని జిత్తులు ప్రదర్శించినా ప్రజలు ఎన్నికల్లో మతోన్మాదాన్ని తిప్పికొట్టే విధంగా ఫలితాలను ఇచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. గురువారం సుందరయ్యభవనంలో సీపీఎం ఎకడమిక్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన టీచర్ల వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు గ్రామ, మండల స్థాయిలో క్లాసులు నిర్వహిస్తున్నామని, శిక్షణలో వర్తమాన రాజకీయాలపై పార్టీ సభ్యులు, శాఖా కార్యదర్శులకు గ్రామ, మండలస్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణ ద్వారా పాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేసే శక్తులను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మిరియం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు ఎం.సుబ్బారావు, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ పాల్గొన్నారు.

కథలు, కవితలకు ప్రోత్సాహం

ఖమ్మంగాంధీచౌక్: హాసిని రామచంద్ర ఫౌండేషన్-2024 ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త పురస్కారంతో పాటు కథలు, కవితల విజేతలకు నగదు ప్రోత్సాహం అందిస్తామని సంస్థ నిర్వాహకులు తోట సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి, పర్యావరణ హితమై, సామాజిక ప్రయోజనాలను కలిగించే విధంగా కథలు, కవిత్వాలు ఉండాలని తెలిపారు. కవితలు 25 లైన్లు, కథలు 4 పేజీలకు మించకుండా ఈ నెల 25వ తేదీలోపు పంపించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9502818774 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: నగరంలోని బల్లేపల్లి సెక్షన్ పరిధి, రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ విద్యుత్ సెక్షన్ల పరిధిలో లైన్ల మరమ్మతు దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయా సెక్షన్ల ఏఈలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లేపల్లి పరిధిలె కైకొండాయిగూడెం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కైకొండాయిగూడెం, పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ సరఫాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. మంచుకొండ పరిధిలో బూడిదంపాడు ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు బూడిదంపాడు, సూర్యతండా, వాంకుడోత్‌తండా, పుటానితండా తదితర గ్రామాల పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగ దారులు సహకరించాలని ఏఈలు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



సీడ్ బాల్స్ తయారు చేస్తున్న వైద్యసిబ్బంది

తిరుమలాయపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, మొక్కలు నాటి సంరక్షించాలని తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరుమలాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బంది సీడ్ బాల్స్ తయారుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ... మొక్కలు పెంచేందుకు తమ ఆస్పత్రి సిబ్బంది సీడ్ బాల్స్ తయారు చేశామని, సీడ్ బాల్స్‌ని వర్షాలు కురుస్తున్న సమయంలో కొండలు, తదితర ప్రాంతాల్లో చల్లడం ద్వారా మొక్కలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి



కూసుమంచి: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: బడి ఈడు పిల్లలంతా బడుల్లో ఉండాలని, ప్రతీ విద్యార్థిని తమ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల విద్యను బలోపేతం చేయుటకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకోవాలని ఇందుకోసం పాఠశాలల్లో మీ పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో ఎంపీడీఓ అశోక్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ క్రిష్ణకుమారి, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కైకొండాయిగూడెంలో.. నగరంలోని కైకొండాయిగూడెం పాఠశాల హెచ్ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్లేకార్డులతో, కరపత్రాలు పంచుతూ గ్రామంలో ర్యాలీ తీశారు.

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.రాములు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం బడిబాట కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని, 3 నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, భవాని తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలతో పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని తల్లిదండ్రులను కోరారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో..



రఘునాథపాలెం: మండలకేంద్రంలో ర్యాలీ..



ఖమ్మంఅర్బన్: కైకొండాయిగూడెంలో..